# ఎడబాటు

రచయిత :
"ఆనంద్"

అది ప్రభాతసమయం. సూర్యుడు తన యెఱ్ఱటికిరణములను ఆబాలుడి ముఖముపై ప్రసరింపచేస్తున్నాడు. కాని ఆబాలుని బుగ్గలమీదనున్న యెఱుపుదనం ఆతడికిరణములను తిరస్కరిస్తున్నది. అక్కడనున్న పొలములలోని వరిమొక్కలు ఆహ్లాదసూచకంగా తమ తలలనాడిస్తూ ఆ బాలుణ్ని ఆహ్వానించేయి. ఆతడు సంతోషంతో పరిగెత్తేడు. ఆ పరుగులో అతడి కురులు ప్రభాతవాయువు పరామర్శచేత నుదుటిమీద వింతగా గంతులేస్తున్నాయి. ఇంతలో ప్రక్కనుంచి ప్రవహిస్తున్న సెలయేరు అతడిదృష్టినాకర్షించింది. రాళ్లరాపిడిచేత కలిగే వింతశబ్దం, ప్రవాహవేగంచేత ఒడ్డుననున్న మట్టిముద్దలు 'దబ్బదబ్బ' మని పడేశబ్దం, నదీప్రవాహపు గలగల ధ్వనితో నాట్యంచేస్తున్నాయి. ఆబాలుడు ఆశాహృదయంతో దానిని తిలకిస్తున్నాడు.

కాని "రామం" అన్న కేకతో త్రుళ్ళిపడ్డాడు. "వస్తున్నాఅమ్మా" అంటూ ఒక్కగంతులో తల్లిని చేరుకొన్నాడు. ఆమె కన్నీటితో రామాన్ని హృదయానికి హద్దుకున్నది.

"ఏడవకు. పిల్లడు బెంగపెట్టుకుంటాడు" ఒక్క నిట్టూర్పువిడిచేడుతండ్రి. ఆమెదుఃఖం మరింత వృద్ధయింది.

"నాలుగు సంవత్సరాలు పెంచేం. చివరకు నిన్నీగతికి తెచ్చేం. ఈనిర్భాగ్యురాలికడుపున ఎందుకు పుట్టేవునాయనా."

ఇంతలో జట్కాచప్పుడైంది. "ఉస్! మరి యేడవకు. ఆయనవచ్చినట్లుంది. ఏడుస్తే కోపబడతాడేమో. ఇంతకూ మనగతి పిల్లలనమ్ముకునేటంత... హీనదశకువచ్చింది." అతడిగొంతుక గద్గదికమైంది. ఆమెహృదయం చలించింది. "సొమ్ముకు బిడ్డనమ్ముకోవడం" అన్నమాటలు యిద్దరిహృదయాలను గాయపరచేయి. రెండు కన్నీటిచుక్కలు రామంతలమీద పడ్డాయి. అర్థంకాక యిద్దరిప్రక్క చూచేడు దీనంగా.

"నారాయణా" తుళిక్కిపడ్డాడు తండ్రి.

"వస్తున్నాబాబూ" అంటూ గబగబా జట్కాను చేరుకున్నాడు.

"తీసుకో" అంటూ నోట్లను అందించేడు రావుబహద్దూర్ కృష్ణాజీ. ఆతురతతో అతడికళ్లు వాటిమీదికి పోయేయి. "వెయ్యిరూపాయలు!" తను యెంతకాలం కష్టపడితే సంపాదించగలడంతసొమ్ము!! "ఆలస్యం చెయ్యకు." హెచ్చరించేడు కృష్ణాజీ. విషాదంతో బాలుణ్ణందించేడు. జట్కాకదిలింది. భయంతో కెవ్వని కేకవేసేడు రామం. ఆతల్లి హృదయంలో యెవరో శూలంగ్రుచ్చినట్లయింది.

* * *

జట్కాలో త్రోవపొడుగునా "అమ్మా, నాన్నా" అనిపిలుస్తున్నాడు రామం. జట్కా ఆగింది తనభవనంలోకి తీసుకొనిపోయేడు కృష్ణాజీ.

"బాబూ, మిఠాయికొందునా" అని అడిగేడు ప్రేమతో.

కాని రామంమాత్రం "నాకు మానాన్నా, అమ్మకావాలి" అని జవాబిచ్చేడు. "పోని చక్కని బొమ్మకొందునా?" కాని ఆ బొమ్మలో రామంకు తన తలిదండ్రులు కనుపించేరు. వాడు మరల "నాకు మానాన్న, అమ్మకావాలి" అన్నాడు.

"ఉస్, యెంతపిట్టో. ఆపిట్టని పట్టుకుందామా?" అని ఆశతో చూచేడు రామంవంక. కాని రామంమాత్రం నిశ్చలంగా "మానాన్న, అమ్మకావాలి" అన్నాడు.

మర్నాడు రామానికి మలేరియాజ్వరం వచ్చింది. జ్వరంలో రామం యెప్పుడూ "నాకు మా నాన్న, అమ్మ కావాలి" అంటూ పలవరిస్తూనే వున్నాడు. అప్పుడప్పుడు మంచంమీదినుంచి లేచి "అదిగో మా నాన్న. అదిగో మా అమ్మ. నేనుకూడా వస్తాను వుండండి." అంటూ బొబ్బరిస్తాడు. రావుబహద్దూర్ కృష్ణాజీగారికి ఏమీ తోచలేదు. బంట్రోతును నారాయణఇంటికి పంపించేరు. ఇద్దరు డాక్టర్లను పెట్టేరు. తాను స్వయంగా రామానికి వుపచారాలు చేస్తూ మంచందగ్గర కూర్చున్నారు. రామానికి ప్రతి రోజూ జ్వరం లావౌతున్నాది. పలవరింపులు అతిశయిస్తున్నాయి. స్వర్గలోకంలోని తనతోడి బాలురు అతడిని ఆడుకుందుకు పిలుస్తున్నారు. "ఇంకా యీ పాపిష్టిలోకంలో యెందుకు జీవిస్తావు?" అంటూ హేళనచేస్తున్నారు. కాని అతడుమాత్రం వారిని వారించి తన తలిదండ్రుల రాకకోసం ప్రతిరోజూ యెదురుచూస్తుంటాడు. అతడికింకా తనతలిదండ్రులు యెప్పుడో ఒకప్పుడు వస్తారని ఆశ. పిచ్చివాడా! ఇంకానీకు వారుకనిపిస్తారా" అని యెవరో తన హృదయంలో చెప్తున్నారు. "లేదు, తప్పకవస్తారు" అని తడబడుతూ అతడిహృదయం సమాధానపరచింది.

మర్నాడు డాక్టరు రామంబ్రతకటం కష్టమని చెప్పేడు. కృష్ణాజీగారిగుండె ఒక్కసారి ఆగిపోయింది.

"మరేవిధంగానైనా బ్రతకడా?"

"తలిదండ్రులను తెప్పిస్తే మంచిది. పిల్లడు మనోవ్యధతో బాధపడుతున్నట్లుంది."

కొంతసేపటికి బంట్రోతువచ్చాడు. "వారిప్పుడక్కడలేరు. చుట్టుపక్కల కనుక్కుంటే గ్రామంలోనే లేరని చెప్పేరు." ఈ మాటలన్నీ రామం విన్నాడు. "మా నాన్న—అమ్మ—రారు" అంటూ నిస్పృహతో తలను వాల్చేసేడు. తమపంతం నెగ్గింది గదా అని తోడిబాలురు గంతులేసేరు. అతడి ప్రాణవాయువులు వారితో ఆడుకుందుకు స్వర్గానికి పరుగెత్తేయి.


# అందరికిని అవకాశము కలదు

●

కొంతధనము వెనుకవేయుటలో మీరు సంవత్సరములుగా అతిజాగ్రతతో చేసికొనిన యేర్పాటు లన్నియు తలక్రిందులైనను దాని వల్ల రాగల వ్యత్యాసమేమియు లేదు.

ఎవరైనను సరియె,—అంతయేల ప్రతివ్యక్తియు, పదిపదునైదు సంవత్సరముల ఆర్జనావకాశమున్న సరియే—నిరాధారమగు వృద్ధాప్యమునకు భయమందవలసిన అవసరములేదు; అట్టివాని ఆర్జన పెద్దదిగ కూడ ఉండనవసరము లేదు. ఆర్జన బహుస్వల్పమైనను ఆర్థికముగ విజయమందవచ్చును. మేము నిర్ణయించిన క్రమవిధానమే, మీకీ యదార్థమును రుజువుచేయగలదు.

పౌరులకు పాలసీలు జారీచేయబడినంతనే—ఎటువంటి అదనపు చార్జియు లేకుండ యుద్ధ, ప్రమాద సంబంధములైన హామీలకు అవి బద్ధమైనవిగ యుండును.

## యునైటెడ్ ఇండియా

ప్రావిడెంట్ అస్సురెన్సు కంపెని లిమిటెడ్.

యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్,
ఎస్ప్లనేడ్ : : మదరాస్.